శిథిలావస్థలో బాల్యం భవనం

- జీటలు వారిన గోడలు
- చిన్నారుల తల్లిదండ్రుల భయాందోళనలు
- చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి


సింహగిరి కాలనీలోని బాల్యం భవనం గోడలో మొలిచిన మహావృక్షం

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు సింహగిరి కాలనీ కొండవాలు ప్రాంతంలోని బాల్యం భవనం శిథిలావస్థకు చేరింది. గణేష్‌నగర్, వరాహగిరి కాలనీ-1, 2, సత్యసాయినగర్, సింహగిరి కాలనీ ప్రాంతాల్లో ఏకైక బాల్యం కేంద్రం ఇదొక్కటే. ఇది సింహగిరి కాలనీలోని సామాజిక భవనంలో ఉంది. దీనిలో ఒక వైపు బాల్యం.. మరో వైపు 14వ వార్డు గణేష్‌నగర్‌కు చెందిన సచివాలయాన్ని నిర్వహిస్తున్నారు. ఈ భవనాన్ని నిర్మించి దాదాపు 40 వసంతాలు కావస్తోందని స్థానికులు చెబుతున్నారు. ఈ భవంతికి ఒక వైపు గోడల నుంచి దాదాపు మహావృక్షమే పెరిగింది. దీని వేళ్లు నలువైపులా గల గోడల్లోకి వ్యాపించి గోడలను బీటలు వారేలా చేశాయి. దీంతో అవి కూలిపోయే స్థితికి చేరాయి. కిటికీల ద్వారా కూడా ఈ చెట్టు వేళ్లు వ్యాపించి భవనాన్ని బలహీన పరుస్తున్నాయి. అనేక చోట్ల బీటలు వారి శ్లాబుల నుంచి పెచ్చులూడటంతో వర్షం వస్తే ఈ గదిలోకి నీరు వచ్చి చేరుతుంది.

ఇరుకు గది.. ప్రమాదకర పరిస్థితి

ఈ బాల్యం భవనంలోని గది ఇరుగ్గా ఉంటుంది. సుమారు 20 మంది పిల్లలు నిత్యం తరగతులకు హాజరవుతున్నారు. ఉన్నది ఒకటే గది కావడంతో ఇందులోనే ఆటపాటలు, విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారు. ఏ క్షణాన ఏమవుతుందో తెలియని పరిస్థితుల మధ్య సిబ్బంది కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇటువంటి ప్రమాదకర భవనంలోకి పిల్లలను పంపించడం ఇష్టం లేక కొందరు తల్లిదండ్రులు పంపించడం లేదు.

మరో వైపు సచివాలయం..

ఇదే భవనంలో మరో వైపు 251 సచివాలయం నిర్వహిస్తున్నారు. ఇది కూడా ఈ వార్డుకు చెందినది కాదు. గతంలో 45వ వార్డులోనే ఉన్నా.. ప్రస్తుతం 14వ వార్డు గణేష్‌నగర్‌కు చెందిన సచివాలయాన్ని ఇక్కడ నిర్వహిస్తున్నారు. దీంతో ఈ వార్డు ప్రజలు స్థానిక సచివాలయాన్ని ఇక్కడ ఏర్పాటు చేయాలని, దీన్ని తరలించాలని పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నారు. ఇటువంటి ప్రమాదకర భవనంలో అటు ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించే సచివాలయం, మరోవైపు చిన్నారుల ఆలనా పాలనా చూసే బాల్యం తరగతులు నిర్వహించడం ప్రమాదకరంగా పరిణమించాయి. ఎటువంటి ప్రమాదం జరగకముందే సంబంధిత అధికారులు దృష్టి సారించి బాల్యం తరగతులను, సచివాలయాన్ని ఇక్కడ నుంచి తరలించాలని స్థానికులు కోరుతున్నారు.


బీటలు వారిన గోడ

ప్రజా సంక్షేమమే సీఎం లక్ష్యం


సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న కె.కె.రాజు

కంచరపాలెం: ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 55వ వార్డు కంచరపాలెం ధర్మానగర్, తిక్కవానిపాలెం ప్రాంతాల్లో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తా నని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శశికళ, ఎస్.అప్పారావు, దుప్పలపూడి శ్రీనివాసరావు, రత్నాకర్, డైరెక్టర్లు ఆర్.శ్రీను, నూకరాజు, వార్డు నాయకులు వై.శ్రీను, గంగామహేష్, శ్రీను, సురేష్, కరుణ, లక్ష్మి, నాగలక్ష్మి, శివప్రసాద్, దాసు సీనియర్ నాయకులు ఎ.శైలేష్, హరిపట్నాయక్, బి.గోవింద, బాబ్జి, రాఘవులు, సుజాత, ఎస్.శ్రీను, ధనరాజు, అశోక్, సచివాలయ సిబ్బంది, జీవీఎంసీ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో ఉత్తరాంధ్రకు అన్యాయం



డీఆర్‌ఎం కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నేత జేవీ సత్యనారాయణమూర్తి, పార్టీ శ్రేణులు

తాటిచెట్లపాలెం: ఇటీవల పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి మండిపడ్డారు. ముఖ్యంగా ఉత్తరాంధ్రకు, విశాఖ రైల్వే జోన్‌కు నిధుల కేటాయింపు దారుణంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా సీపీఐ నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం దొండపర్తిలోని డీఆర్‌ఎం కార్యాలయం ముందు నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదని, విశాఖ కేంద్రంగా ప్రకటించిన దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు కేటాయింపులు అంతంత మాత్రమేనని పేర్కొన్నారు. ప్రధాని మోదీ తొలిసారి అధికారం చేపట్టే సరికి అదాని దేశ సంపన్నుల జాబితాలో 630వ స్థానంలో ఉండేవాడని, ఇప్పుడు మొదటి స్థానంలో నిలిచాడని, దీనిని బట్టి మోదీ సర్కార్ ఇటువంటి వారికి ఎంత ప్రోత్సాహం ఇచ్చిందో అర్థమవుతోందన్నారు. ఇటీవల హిండెన్ బర్గ్ నివేదిక వెలువడిన నేపథ్యంలో అదాని సంపద కుచించుకుపోయిందని, ఇంతటి సంపాదన అర్జన వెనుక ఉన్న వారిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను శిక్షించాలని, విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకుని జాతీయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, కార్యవర్గ సభ్యులు ఎ.విమల, ఎస్.కె.రెహమాన్, పి.చంద్రశేఖర్, సి.ఎన్.క్షేత్రపాల్, జి.కాసులు రెడ్డి, ఎ.దేముడమ్మ, పి.గోవిందు, జి ఫణీంద్ర, యు.నాగరాజు, ఎన్.అప్పన్న, వి.నల్లయ్య, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైభవుడికి నేడు సుప్రభాత సేవ


వైభవ వేంకటేశ్వరుడు

మురళీనగర్: కప్పరాడ ఎన్జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తామని ఆలయ ఈవో బండారు ప్రసాద్ తెలిపారు. తెల్లవారుజామున సన్నిధి గొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి విని పిస్తామన్నారు. అనంతరం స్వామికి అభిషేకాలు, ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన ఉంటుందని చెప్పారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తామన్నారు. సాయంత్రం 7 గంటలకు నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు వెంకన్నకు సమర్పిస్తామని తెలిపారు.

హెల్మెట్ ధారణతో సురక్షిత ప్రయాణం


ద్విచక్ర వాహన చోదకులకు హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తున్న సీఐ షణ్ముఖరావు

సీతంపేట: సురక్షిత ప్రయాణం కోసం ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ ధరించాలని ఫోర్త్ టౌన్ ట్రాఫిక్ సీఐ షణ్ముఖరావు సూచించారు. అక్కయ్యపాలెం హైవే వద్ద శుక్రవారం హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వాహన చోదకులకు అవగాహన కల్పించారు. చాలా వరకు రోడ్డు ప్రమాదాల్లో సంభవించే మరణాలు హెల్మెట్ లేకపోవడం వల్లే జరుగుతున్నాయని గణాంకాలు చెబుతున్నాయన్నారు. హెల్మెట్ ధారణ వల్ల ప్రమాదాలు జరిగేటప్పుడు చాలా వరకు ప్రాణపాయం నుంచి తప్పించుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ వి.వాణిశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నిర్మూలనకు ఫాగింగ్


గణేష్‌నగర్‌లో ఫాగింగ్ చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

సీతంపేట: దోమల నిర్మూలనకు శుక్రవారం 25వ వార్డులోని పలు ప్రాంతాల్లో జీవీఎంసీ సిబ్బంది ఫాగింగ్ చేపట్టారు. ఇటీవల సీతంపేటలో ఇద్దరికి డెంగ్యూ జ్వరాలు సోకడంతో యాంటీ మలేరియా సిబ్బంది చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా గణేష్‌నగర్, రెల్లి వీధి, హరిజన వీధి, కనకమ్మ వీధి, రాధాకృష్ణాలయం ప్రాంతాల్లో ఫాగింగ్ చేశారు.

గైస్ అభివృద్ధికి కృషి



కెమ్‌దోసా సమావేశానికి హాజరైన సభ్యులు

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గైస్) అభివృద్ధికి కృషి చేయాలని కాలేజీ పూర్వ విద్యార్థుల సంఘం (కెమ్‌దోసా) కార్యవర్గ సభ్యులు నిర్ణయించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఈమేరకు నిర్ణయం తీసుకున్నారు. కాలేజీని ఎన్‌బీఏ అక్రిడిటేషన్‌కు తయారు చేసేందుకు తమ వంతు సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 25న కెమ్‌దోసా సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కెమ్‌దోసా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీనివాస కల్యాణోత్సవం రేపు


కల్యాణ ఆహ్వాన పత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రభాకర్ తదితరులు

సీతంపేట: లోక కల్యాణార్థం ఈ నెల 12వ తేదీ ఆదివారం ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు సీతమ్మధార టీపీటీ కాలనీ ద్రవిడ సంక్షేమ సంఘం శ్రీలలితా నూకాల కామేశ్వరి కల్యాణ మండపంలో శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్టు శృతిలయ సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షుడు యు.ప్రభాకర్ తెలిపారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శుక్రవారం కల్యాణోత్సవ ఆహ్వాన పత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఉదయం 10 గంటలకు అన్నమాచార్య సంకీర్తన, మధ్యాహ్నం 3 గంటలకు సీతమ్మధార త్రిమూర్తికా వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద నుంచి కోలాటం, నృత్యాలతో తిరువీధి మహోత్సవం కల్యాణ మండపం వరకు జరుగుతుందన్నారు. సాయంత్రం 6 గంటలకు వైఖానస ఆగమ సంప్రదాయంలో పాణంగిపల్లి రంగనాథాచార్య స్వామి బృందంచే శ్రీనివాస కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తి గీతాలాపన, నవ చైతన్య కళా నాట్య మండలి సభ్యులచే శ్రీనివాస కల్యాణం నృత్య రూపకం ఉంటుందన్నారు. కల్యాణోత్సవంలో పాల్గొనే దంపతులకు శేషవస్త్రాలు, స్వామి వారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కల్యాణోత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు ఎం.వి.రాజశేఖర్, ఎమ్మెస్ మాధవ్, మేడా మస్తాన్‌రెడ్డి, చెన్నా తిరుమలరావు, ఎస్.ఎన్.స్వామి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పార్వతీశ్వరుల కల్యాణం


ప్రత్యేక అలంకరణలో పార్వతీశ్వరులు


కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

సీతంపేట: పండితుల వేదమంత్రాలు, మేళతాళాల మధ్య ఆదిదంపతుల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. 25వ వార్డు సీతంపేట గణేష్‌నగర్‌లోని పార్వతీశ్వరాలయంలో పార్వతీపరమేశ్వరుల 33వ వార్షిక కల్యాణ మహోత్సవం శుక్రవారం కన్నుల పండువగా నిర్వహించారు. పలు రకాల పండ్లతో చూడముచ్చటగా తీర్చిదిద్దిన కల్యాణ వేదికపై ప్రత్యేక అలంకరణలో ముస్తాబైన పార్వతీశ్వరుల ఉత్సవ విగ్రహాలకు పండితుల వేద మంత్రాల నడుమ కల్యాణం శాస్త్రోక్తంగా జరిపించారు. ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్రాలు, పూల దండలు, ఆభరణాలతో చక్కగా అలంకరించారు. కంకణధారణ, సుముహూర్తం, మాంగల్యధారణ, తలంబ్రాల ఘట్టాలను కళ్లకు కట్టినట్టు చూపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాసన, అస్త రాజార్చన, వాస్తుపూజ, అంకురార్పణ, ధ్వజారోహణ, అగ్ని ప్రతిష్టాపన నిర్వహించారు. ఆగమ పండితుడు అయిలూరి శ్రీనివాస దీక్షితులు, ఆలయ ప్రధాన అర్చకులు గంగవరపు శివాజీశర్మ, భాస్కరశర్మ, ఈవో జగన్నాథరావు పర్యవేక్షణలో కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. భక్తులకు తీర్థప్రసాదాలు, తలంబ్రాలు అందజేశారు.

నేడు ఊరేగింపు..

ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం 6 గంటలకు పార్వతీశ్వర స్వామి ఊరేగింపు మేళతాళాలతో జరుగుతుందని ఆలయ అర్చకులు తెలిపారు. అనంతరం ఏకాంత సేవ నిర్వహిస్తామని, భక్తులు పాల్గొనాలని కోరారు.

మహిళలకు ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం


పాల్గొన్న వాకర్స్ క్లబ్ మహిళలు


మహిళా వాకర్స్ క్లబ్ సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ బెహరా లక్ష్మీప్రవీణ్య

మురళీనగర్: మహిళలు తమ వ్యక్తిగత ఆరోగ్యాన్ని కాపాడుకున్నప్పుడే కుటుంబమంతా ఆరోగ్యంగా ఉంటుందని మహిళల వైద్య నిపుణురాలు డాక్టర్ బెహరా లక్ష్మీప్రవీణ్య అన్నారు. వాకర్స్ పార్కులో శుక్రవారం మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల ఆరోగ్య సమస్యలు–పరిష్కారం అనే అంశంపై ఆమె మాట్లాడారు. మన కుటుంబ సభ్యుల ఆరోగ్యంతోపాటు వ్యక్తిగతంగా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. మహిళలు మానసిక, శారీరకంగా బలంగా ఉండాలని, వారి జీవితంలోని నాలుగు దశల్లోనూ ప్రత్యేక సమస్యలు ఉంటాయని వాటిని సకాలంలో పరిష్కరించుకోవాలని చెప్పారు. గైనిక్ సమస్యలను చూసి భయపడాల్సిన అవసరం లేదని, రుతుక్రమంలో తేడాలు గమనించినప్పుడు డాక్టర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈస్ట్రోజన్, ప్రొజెస్ట్రాన్ వంటి హార్మోనులు మహిళల్లో గుండె జబ్బులు రాకుండా కాపాడుతాయన్నారు. శ్వాసకు సంబంధించిన వ్యాయామం చేయడం వల్ల హార్మోనుల ఉత్పత్తి పెరుగుతుందని చెప్పారు. మహిళల్లో బ్రెస్ట్, సర్వైకల్, ఎండోమెట్రియల్, ఒవేరియన్ క్యాన్సర్‌లు వచ్చే అవకాశం ఉందన్నారు. వీటి లక్షణాలను సకాలంలో గుర్తిస్తే నివారణ సాధ్యమవుతుందన్నారు. 40 ఏళ్లు దాటిన మహిళలు స్క్రీనింగ్ చేయించుకోవాలని సూచించారు. అనంతరం డాక్టర్ లక్ష్మీప్రవీణ్యను క్లబ్ మహిళలు సత్కరించారు. ఈ నెలలో పుట్టిన రోజు జరుపుకుంటున్న మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.శేషామణి, ఎస్.పుష్పలత, పూర్వ అధ్యక్షులు కె.మాధవి, డి.శిరీష, పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పోటీతత్వం పెరగాలి


ఐఎస్‌టీడీ స్టూడెంట్ చాప్టర్‌ను ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ సాంబశివరావు

మురళీనగర్: విద్యార్థులు పోటీతత్వాన్ని అలవరచుకోవాలని ఇండియన్ సొసైటీ ఫర్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్(ఐఎస్‌టీడీ) జాతీయ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ ఎన్.సాంబశివరావు అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ప్రిన్సిపాల్ జీవీవీ సత్యనారాయణమూర్తి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఐఎస్‌టీడీ స్టూడెంట్ చాప్టర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగాలకు సంబంధించిన ఇంటర్వ్యూల్లో విద్యార్థుల సమర్థత, నైపుణ్యాలనే పరిగణలోకి తీసుకుంటారని చెప్పారు. ఐఎస్‌టీడీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ ఒ.రామ్మోహనరావు మాట్లాడుతూ ఐఎస్‌టీడీ ద్వారా ఉన్నతమైన ఆలోచనలు పంచుకోవచ్చన్నారు. ఐఎస్‌టీడీ స్టూడెంట్ చాప్టర్ ఉపయోగాలు, నియమ నిబంధనలను వివరించారు. సాఫ్ట్ టెక్ సీఈవో పి.సునీల్ మాట్లాడుతూ డిప్లొమా చేసిన విద్యార్థులకు ఉన్నత అవకాశాలు ఉన్నాయన్నారు. కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ బోకం దేముడు మాట్లాడుతూ విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో కాలేజీ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాయినాథుడికి ప్రత్యేక అభిషేకాలు


సాయిబాబా విగ్రహానికి జలాభిషేకం చేస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మర్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు భీమ్‌నగర్‌లో శ్రీ సంపత్ సాయి సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం జ్ఞాన సరస్వతి ఆలయ 23వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయినాథుడిని కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ దర్శించుకుని ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం ఆయనకు కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు.

51వ వార్డులో శంకుస్థాపనలు

మర్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు అంబేడ్కర్ కాలనీలోని గ్రీన్‌బెల్ట్ ఏరియాలో కళావేదిక, హైవే పక్కనున్న వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద రిటైనింగ్ వాల్ నిర్మాణానికి శుక్రవారం కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ శంకుస్థాపన చేశారు. రూ.63.10 లక్షల వ్యయంతో ఈ పనులు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేషన్ డైరెక్టర్లు, మహిళా నాయకులు, సీనియర్ నాయకులు, ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భూ ఆక్రమణలపై కఠిన చర్యలు


రూరల్ తహసీల్దార్ రమణయ్య

ఆరిలోవ: రూరల్ మండలంలో ప్రభుత్వ భూముల ఆక్రమణకు పాల్పడినవారిపై కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ సనపల రమణయ్య హెచ్చరించారు. ఇక్కడ ఇంతవరకు పనిచేసిన పాల్ కిరణ్ కలెక్టరేట్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో రమణయ్య గురువారం బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తమ పరిధి అటు కొమ్మాది, మారికవలస, రుషికొండ, ఎండాడ, సాగర్‌నగర్, విశాలాక్షినగర్ నుంచి ఇటు సింహాచలం, అడవివరం, ముడసర్లోవ, ఆరిలోవ, డెయిరీఫారం ప్రాంతం వరకు సువిశాలమైనదన్నారు. విశాలమైన ఈ పరిధిలో రాజకీయ నాయకులు, ఉన్నతాధికారుల ఒత్తిళ్లు ఎక్కువగానే ఉంటాయి. ఇక్కడ విధులు నిర్వహించడం ఓ సవాల్ లాంటిదే. ఏది ఏమైనా తన విధులు బాధ్యతాయుతంగా నిర్వహిస్తానని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములను రక్షించడంతో పాటు జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రాధాన్యతా కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహిస్తామన్నారు. ప్రజలకు సర్టిఫికెట్లు జారీ చేయడంలో జాప్యం లేకుండా సకాలంలో అందిస్తామన్నారు. మధురవాడ, ఎండాడ, రుషికొండ, ఆరిలోవ, ముడసర్లోవ ప్రాంతాల్లో ఎక్కువగా ప్రభుత్వ భూములు ఉన్నాయన్నారు. ఆయా ప్రాంతాల్లో తరచూ ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నట్లు ఉన్నతాధికారుల దృష్టిలో ఉందన్నారు. మండలం పరిధిలో ప్రభుత్వ ఆస్తులు కాపాడటమే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. వాటిని ఆక్రమిస్తే ఎలాంటివారిపైనైనా కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఫుట్‌పాత్‌పై ఆక్రమణల తొలగింపు

మర్రిపాలెం: మర్రిపాలెం నుంచి ఎన్ఏడీ వరకు ఉన్న ఫుట్‌పాత్ ఆక్రమణలను శుక్రవారం కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నారని తన దృష్టికి రావడంతో చర్యలు చేపట్టామని సీఐ మళ్ల అప్పారావు తెలిపారు. ఎస్ఐ వాసుదేవరావు, సిబ్బంది, జీవీఎంసీ సిబ్బందితో కలిసి సంయుక్తంగా ఆక్రమణలను తొలగించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఆయా ప్రాంతాల్లో స్కూళ్లు ఎక్కువగా ఉండటంతో పాదచారులు, విద్యార్థులు వెళ్లేందుకు వీలుగా ఫుట్‌పాత్‌లను ఖాళీ చేయాలని సూచించారు. విద్యార్థులు రోడ్లపై కాకుండా ఫుట్‌పాత్‌లపై నడిచేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా రోడ్లపై వ్యాపారాలు నిర్వహిస్తున్న 24 మందిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకున్నామని తెలిపారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు ఎన్జీజీవోస్ కాలనీలో 158/బీ/3 విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. పోల్ పైభాగం శిథిలం కావడంతోపాటు దాని నుంచి వస్తున్న నిప్పురవ్వలు ఇంటి బాల్కనీలో పడుతున్నాయని నివాసులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డులో కేవలం 20 అడుగుల దూరంలో మూడు హెచ్‌టీ విద్యుత్ లైన్ స్తంభాలు ఉన్నాయి. ఇళ్లకు సమీపంగా ఉండటం, పైభాగం శిథిలమవడం వల్ల ప్రమాదకరంగా ఉన్న 158/బీ/3 స్తంభాన్ని తొలగించాలని సంబంధిత అధికారులను పలువురు స్థానికులు కోరుతున్నారు.


దెబ్బతిన్న స్తంభం పైభాగం


ఎన్జీజీవోస్ కాలనీలో ఇంటికి సమీపంగా ఉన్న విద్యుత్ స్తంభం

15న తెలుగు విభాగం ఫ్రెషర్స్ డే

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయ తెలుగు విభాగం స్నాతకోత్తర విద్యార్థులు ఈ నెల 15న ఎంఏ తెలుగు ప్రథమ సంవత్సర విద్యార్థులకు స్వాగత కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు శుక్రవారం తెలిపారు. ఫ్రెషర్స్ డే ద్వారా విద్యార్థుల మధ్య స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులకు వివిధ క్రీడల్లో పోటీలను నిర్వహించారు. నూతన విద్యార్థుల్లో ఉన్న భయాలను తొలగిస్తూ వారిలో శారీరక, మానసిక ఉల్లాసానికి తోడ్పడేలా ఆటపాటల కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. సీనియర్స్, జూనియర్స్ అనే భేదం లేకుండా అంతా ఒక్కటై పోటాపోటీగా కార్యక్రమాలలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు.

విద్యాతరంగిణి చీఫ్ వార్డెన్‌గా వినుత



హాస్టల్ వార్డెన్‌గా ఉత్తర్వులు స్వీకరిస్తున్న డాక్టర్ వినుత

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పెరిగిన విద్యార్థినుల సంఖ్యకు అనుగుణంగా వారి వసతి కోసం విద్యాభవన్‌ను హాస్టల్‌గా తీర్చిదిద్ది విద్యాతరంగిణిగా మార్పు చేశారు. ఈ హాస్టల్ ఇన్‌చార్జి చీఫ్ వార్డెన్‌గా ఏయూ అప్లయిడ్ మేథమెటిక్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ టి.వినుత నియమితులయ్యారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి సమక్షంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు నుంచి ఆమె ఉత్తర్వులు స్వీకరించారు. కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ వినుతను ఆచార్య టి.శోభశ్రీ, ఆచార్య ఏ.కె.ఎం.పవార్ తదితరులు అభినందించారు.